క్లుప్తంగా

4 రోజులు బ్యాంకు సేవలకు అంతరాయం

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని ఏపీజీవీ బ్యాంకు సేవలకు నాలుగు రోజులపాటు అంతరాయం ఏర్పడనుందని గోపాల్‌పేట ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఏపీజీవీబీ బ్యాంకు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం అవుతున్నందున 28, 29, 30, 31 తేదీల్లో బ్యాంకు సేవలు నిలిచిపోతాయన్నారు. తిరిగి జనవరి 1, 2025 నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. మండల ప్రజలు ఈ విషయాన్ని తెలుసుకొని, సహకరించాలని కోరారు.

‘కష్టపడిన వారికి పదవులు దక్కడం లేదు’

వనపర్తి టౌన్: కాంగ్రెస్ అధికారంలో ఉన్నా.. లేకపోయినా పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులు దక్కడం లేదని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి అత్యంత సన్నిహితుడైన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ నిరంజన్‌బాబా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వనపర్తి కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న తనకు ఏజీపీగా అవకాశం రాకపోవడంపై తీవ్ర మనస్తాపానికి లోనయ్యానన్నారు. ప్యానల్‌లో తన పేరును ప్రతిపాదించినప్పటికీ కాంగ్రెస్ పార్టీకి ఏనాడు పనిచేయని వారికి పదవి దక్కిందని అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో 18ఏళ్లుగా ఎన్‌ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ విభాగంలో పనిచేస్తూ నిరంతరం పార్టీ అభివృద్ధికి పాటుపడ్డానని తెలపారు. పార్టీలో క్రమశిక్షణ కలిగి పార్టీ అభ్యున్నతికి పాటుపడిన వారిని గుర్తించకపోతే ఏం ప్రయోజనం ఉంటుందని నిలదీశారు. ఇక ముందైనా నామినేటెడ్ పదవుల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ ఏఈ కొండయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖిల్లాఘనపురం గ్రామంలో సాధారణ స్తంభాల ద్వారా ఉన్న విద్యుత్ లైన్‌ను నూతనంగా ఖిల్లాఘనపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రైతులు, దుకాణాదారులు, రైస్ మిల్లుల వారు సహకరించాలని కోరారు.

ఇంటిని ఢీకొన్న పొక్లెయిన్



కేటీదొడ్డి: జేసీబీ వాహన డ్రైవర్ నిర్లక్ష్యంతో వాహనాన్ని ఇంటిని ఢీకొన్న ఘటన మండల పరిధిలోని పాతపాలెం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. మైనర్ బాలుడు జేసీబీ వాహనాన్ని నడపడం వల్లే ప్రమాదం చోటు చేసుకుందని ఇంటి యాజమాని సయ్యద్ షాష ఆరోపించారు. వివరాలు.. పాతపాలెం గ్రామానికి చెందిన మైనర్ బాలుడు శుక్రవారం జేసీబీ వాహనాన్ని నడుపుతూ గ్రామానికి చెందిన సయ్యద్ పాష ఇంటిని ఢీకొట్టాడు. దీంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. మైనర్ బాలుడు జేసీబీ వాహనం నడపడం వల్లే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. వాహన యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుక్కల బెడదను నివారించండి



వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఊరకుక్కల బెడద పెరిగిందని, అధికారులు స్పందించి కుక్కలను గ్రామ శివారులకు తరలించాలని పలువురు కోరుతున్నారు. తూంకుంట, సంగినేనిపల్లి, వీపనగండ్ల, బొల్లారం తదితర గ్రామాల్లో పలువురిపై ఊరకుక్కలు దాడి చేసి గాయపరిచాయన్నారు. కుక్కల నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ



గద్వాలటౌన్ : నడిగడ్డ ఇలవేల్పు జమ్ములమ్మ అమ్మవారికి భక్తులు వెండి కిరీటాన్ని బహూకరించారు. హైదరాబాద్‌కు చెందిన సెవెన్ హిల్స్ ప్రింటర్స్ అధినేత కొంకతి రాకేష్ కుటుంబ సభ్యులు జమ్ములమ్మ అమ్మవారికి కిలో వెండితో చేసిన కిరీటాన్ని శుక్రవారం ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఉన్నారు.

మన్మోహన్ సింగ్ సేవలు మరువలేనివి



అమరచింతలో..



కొత్తకోటలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, అభిమానులు



ఆత్మకూర్‌లో..



ఖిల్లాఘనపురంలో..

సాక్షి, నెట్‌వర్క్: దేశంలో ఆర్థిక సంస్కరణలు అమలు చేసి అభివృద్ధికి నాంది పలికిన మన్మోహన్‌సింగ్ సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో వాటిని అధిగమించి దేశానికి సంక్షేమ ఫలాలు అందించారని కొనియాడారు. గురువారం రాత్రి ఆయన మృతి చెందడంతో జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాలు, గ్రామాల్లో ప్రధాన కూడళ్లు, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు ఈ మేరకు సంతాపం ప్రకటించారు. దేశం ఓ గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందన్నారు.

■ కొత్తకోట చౌరస్తాలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మదనాపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పి.ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎన్‌జే బోయేజ్, కృష్ణారెడ్డి, వేముల శ్రీనివాస్‌రెడ్డి, మేస్త్రి శ్రీనివాసులు, బీచుపల్లియాదవ్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, బాలనారాయణ, కోఆప్షన్ సభ్యుడు మిషేక్, సలీంఖాన్, ముజీబ్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

■ వీపనగండ్ల మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక అధికారి నర్సింహ, మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్, నారాయణరెడ్డి, ఎత్తం కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నక్క విష్ణు, గోపి, కావలి మహేష్, అల్వారు వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

■ మదనాపురం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గజ్జల నాగన్న పాల్గొన్నారు.

■ గోపాల్‌పేట మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు శివన్న, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొంకి వెంకటేష్, ఉపాధ్యక్షుడు నాగశేషి, శేఖర్, మేస్త్రీ బాలయ్య, వెంకటయ్య, నాయకులు పాల్గొన్నారు.

■ ఖిల్లాఘనపురంలో తెలంగాణ తల్లి చౌరస్తాలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి, దేవిజానాయక్, మదన్‌మోహన్, క్యామ రాజు, కృష్ణయ్య, ఆగారం ప్రకాష్, దయాకర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, నారాయణ, డాక్టర్ నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

■ ఆత్మకూర్‌లోని గాంధీచౌక్‌లో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, తులసీరాజ్, శ్రీను, గంగా, మహమూద్, ఖాజన్న, రాములు, మధు, అశోక్, అబ్దుల్లా, రఘు, గోపాల్, సాయిరాఘవ, చిరంజీవి తదితరులు ఉన్నారు.

■ అమరచింత మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం కాంగ్రెస్ నాయకులు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అరుణ్, మాజీ ఎంపీటీసీ తిరుమలేష్, కౌన్సిలర్ రాజ్‌కుమార్, పోసిరిగారి విష్ణు, లక్ష్మీకాంత్‌రెడ్డి, బాలరాజ్, శ్యాం, ప్రకాశం, హనుమంతు నాయక్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

■ పెద్దమందడి మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీఓ సురేష్, టెక్నికల్ అసిస్టెంట్ సత్యం, ఫీల్డ్ అసిస్టెంట్లు చెవ్వ మల్లయ్యయాదవ్, రాంరెడ్డి ఎండీ రహీం, భీమన్న, కొండారెడ్డి, నరసింహగౌడ్, చుక్క ఆంజనేయులు, రామచంద్రయ్య తదితరులు ఉన్నారు.



గోపాల్‌పేటలో..



మదనాపురంలో..



కల్వరాలలో..



పెద్దమందడి ఎంపీడీఓ కార్యాలయంలో..

సీపీఎం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

వనపర్తి రూరల్: సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు గదం మదన్ ఆధ్వర్యంలో పలువురు నాయకులతో కలిసి శుక్రవారం జిల్లా కేంద్రంలోని మరికుంట ధర్నాచౌక్‌లో పట్టణ సమస్యలపై రెండో రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ధర్నాకు హాజరైన సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పేరుతో చేస్తున్న సర్వేను గతంలో దరఖాస్తు ఇచ్చిన వారితో పాటు ఇవ్వని వారిని కూడా అర్హులుగా గుర్తించి వివరాలు నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటిని తిరిగి అర్హులైన నిరుపేదల నుంచి దరఖాస్తు తీసుకోవాలని కోరారు. గతంలో సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో 670 మందికి పట్టా పేపర్లు ఇచ్చారని, వారందరికీ ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కురుమయ్య, బాలస్వామి, గంధం గట్టయ్య, రమేష్, బీసన్న, సాయిలీల, కవిత, ఉమ, రత్నయ్య, మన్యం, లక్ష్మి, శ్యామల, నందిమళ్ల రాములు, రాబర్ట్ మద్దిలేటి పాల్గొన్నారు.

ఓటీఎస్ మేళాను వినియోగించుకోండి

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ద్వారా రుణాలు తీసుకుని దీర్ఘకాలికంగా చెల్లించని వారు ప్రత్యేక వన్ టైం సెటిల్‌మెంట్ స్కీం ద్వారా రుణ విముక్తులు అయ్యే వెసులుబాటు ఉందని, అవకాశాన్ని ఖాతాదారులు వినియోగించుకోవాలని బ్యాంకు మేనేజర్ రవీందర్‌బాబు కోరారు. ఈ నెల 30, 31వ తేదీన రెండు రోజుల పాటు ఈ మేళాను నిర్వహిస్తున్నామని, పైప్‌లైన్, ముద్ర, వ్యక్తిగత రుణాలు, తీసుకున్న వారు మేళాలో పాల్గొని బ్యాంకు ద్వారా అందే వెసులుబాటును వినియోగించుకోవాలన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి

పాన్‌గల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలని, అధికారులు నిర్లక్ష్యం కారణంగానే ప్రజలు దీక్షలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని రేమద్దులలో నెలకొన్న స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజా సంఘాలు, సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి మూడో రోజుకు చేరింది. పార్టీ నాయకులతో దీక్ష శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో అసంపూర్తి అదనపు గదుల నిర్మాణం పూర్తి చేయాలని విద్యార్థులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ నిర్వహించి సమస్యను జిల్లా అధికారులకు విన్నవించిన ఫలితం లేదని ధ్వజమెత్తారు. అసంపూర్తి రోడ్లు, డ్రెయినేజీ వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, మిగిలిన రైతులకు రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ డిమాండ్ చేశారు.

బీజేపీలో చేరిక



పెద్దకొత్తపల్లి: పెదకారుపాముల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బీనమోని లింగస్వామి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీతోనే పేదల సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు, జాతీయ మాజీ ఓబీసీ కమిషన్ సభ్యులు ఆచారి, వెంకటయ్య, విమేష్‌రెడ్డి, సాతాని శీను, మేకల శివ పాల్గొన్నారు.

రాయినిపల్లిలో ‘భగీరథ’ పైపులైన్ లీకేజీ



మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ

పాన్‌గల్: మండలంలోని రాయినిపల్లి గ్రామంలో వారం రోజుల నుంచి మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో తాగునీరు వృథాగా పోయి రోడ్డు బురదమయంగా మారింది. గ్రామంలోని పైపులైన్ తరుచుగా లీకేజీ అవుతూ నీరు వృథా అవుతున్న విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మరమ్మతు తూతూమంత్రంగా చేస్తుండటంతోనే తరుచుగా పైపులైన్ లీకేజీలు అవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీ కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై మిషన్ భగీరథ ఏఈ అనుదీప్‌రెడ్డిని వివరణ కోరగా.. సమస్య తమ దృష్టికి వచ్చిందని, తరుచూ లీకేజీలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపుతూ రెండు రోజుల్లో మరమ్మతు చేపడతామని పేర్కొన్నారు.

ముగిసిన ‘ఉపాధి’ సామాజిక తనిఖీ గ్రామసభలు

పాన్‌గల్: మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ఈనెల 22వ తేదీ నుంచి నిర్వహించిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు మండలంలోని బహదూర్‌గూడెం, తెల్లరాళ్లపల్లి, బుసిరెడ్డిపల్లి, దావాత్‌ఖాన్‌పల్లి, బండపల్లి, చింతకుంట, కొత్తపేట, కిష్టాపూర్‌తండా, శాగాపూర్‌తండా, మాధరావుపల్లి, మంగళ్లపల్లి గ్రామాల్లో 14వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి, 2024 వరకు నిర్వహించిన రూ.188.21 లక్షలకు సంబంధించిన పనులు, చేసిన ఖర్చుపై గ్రామ సభలో పనుల వారీగా చర్చించి, అభ్యంతరాలను నమోదు చేసుకున్నట్లు సామాజిక తనిఖీ సిబ్బంది పేర్కొన్నారు.



కొత్తపేట గ్రామసభలో ఉపాధి పనులపై చర్చిస్తున్న అధికారులు, గ్రామస్తులు

నేడు పాన్‌గల్‌లో ప్రజావేదిక

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 14వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి శనివారం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీఓ కుర్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

క్షయ నివారణపై అవగాహన



టీబీ వ్యాధి పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్, గోప్లాపూర్‌తండాలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో టీబీ వ్యాధి నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య మాట్లాడారు. రెండు వారాలకు మించి ఎడతెరపి లేకుండా దగ్గు, జ్వరం, తెమడలో రక్తం పడటం, అలసట లేదా నీరసం, రాత్రి పూట చెమటలు పట్టడం, స్వల్ప కాలంలో బరువు తగ్గడం, శారీరక ఆరోగ్యంలో ఆకస్మిక మార్పులు, ఏదైనా శరీర భాగంలో లింపు గ్రంథుల వాపు, ఛాతి ఎక్స్‌రేలో అసాధారణ మచ్చలు కనిపించడం వంటి లక్షణాలు ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ వ్యాధి జుట్టు, గోళ్లు మినహా శరీరంలోని అన్ని అవయవాలకు వ్యాపిస్తుందన్నారు. ఎక్కువగా ఊపిరితిత్తులు, పేగులు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, వెన్నముకకు వ్యాధి వ్యాపిస్తుందని వివరించారు. వ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. వీరికి నిక్షయ్ పోషణ్ యోజన పథకం ద్వారా బలవర్ధక పోషకాహారాన్ని తీసుకునేందుకు ప్రతి నెల రూ.500 పారితోషకం అందజేస్తారని తెలిపారు. అనుమానితుల నుంచి పరీక్ష నిమిత్తం తెమడను సేకరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు సతీష్‌కుమార్, నర్సమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు నర్సింహస్వామి ఆధ్వర్యంలో కుంకుమార్చన పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

సొంత భవనాలు కరువు



అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

- అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు
- మండలం ఏర్పడి ఎనిమిదేళ్లయినా అడుగు ముందుకు పడలే..

చిన్నంబావి: ప్రజలకు పాలనపరమైన సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం 2016లో చిన్నంబావిని మండలంగా ఏర్పాటు చేశారు. మండలం ఏర్పడి 8 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు అభివృద్ధికి మాత్రం నోచుకోవట్లేదు. పనుకు మండల కేంద్రం తప్పా వాటికి అవసరమైన వసతులు కల్పించడంలో అధికారులు, పాలకులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. కొత్త మండలం నుంచి ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదు. పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లో కొనసాగుతుండటంతో ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. కార్యలయాలకు చెల్లించే అద్దెతో భవన నిర్మాణాలు పూర్తయ్యేవనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎంపీడీఓ కార్యాలయాన్ని ఇటీవల ప్రారంభించినా.. ఇంకా ఎంఈఓ కార్యాలయంలోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించాలని సొంత భవనాలు నిర్మించాలని కోరుతున్నారు.

ఆస్పత్రికి మోక్షం లేదు

మండలంలో ప్రభుత్వ ఆస్పత్రి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా అనారోగ్యం బారిన పడితే మండలానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొల్లాపూర్, వీపనగండ్ల మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారు అంతదూరం వెళ్లే లోగా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, పాము కాటుకు గురైనా ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిందే. చిన్న జ్వరం వచ్చినసరే మండలంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లేకపోవడంతో ఇతర మండలాలకు వెళ్లాల్సి వస్తుందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి జూపల్లి పైనే ఆశలు

2016లో అప్పటి ప్రభుత్వం మండలాలు ఏర్పాటు చేస్తున్న సమయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు కృషి వల్ల చిన్నంబావిని నూతన మండలంగా ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వ కార్యాయాలకు సొంత భవనాలు నిర్మించలేదు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్న జూపల్లిపై ఆశలు పెట్టుకున్నామని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



ఎంఈఓ కార్యాలయంలో..

పక్కా భవనాలు నిర్మించాలి

మండలం ఏర్పడి ఎనిమిదేళ్లు గడుస్తున్న నేటికీ ప్రభుత్వ కార్యాయాలకు భవనాలు లేక మండల ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా నేటికీ మండలంలో ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదు. కనీసం ఆస్పత్రి నిర్మాణం అయినా చేసి మండల ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేలా చేయాలి. – ధారాసింగ్, బెక్కెం గ్రామం

స్థల సేకరణలో జాప్యం

ఎంపీడీఓ కార్యాలయానికి సొంత భవనం కావాలని అధికారులు, మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్లాం. పక్కా భవనం లేకపోడంతో.. రెండు నెలల క్రితం నూతనంగా నిర్మించిన ఓ అద్దె భవనంలోకి మార్చాం. కార్యాలయానికి స్థల సేకరణ చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు స్థలం చూపిస్తే వెంటనే పనులు మొదలుపెడతాం. – రమణరావు, ఎంపీడీఓ

మరుగునపడిన ఫ్రై డే.. డ్రై డే



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది (ఫైల్)

రహదారుల పరిశుభ్రతకే ప్రాధాన్యం

అమరచింత: జిల్లాలోని మున్సిపాలిటీలతో పాటు గ్రామాల్లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే విధంగా నిర్వహిస్తున్న డ్రై డే కార్యక్రమాలు మరుగునపడ్డాయి. గ్రామాలతో పాటు పట్టణాల్లో ప్రభుత్వపరంగా వివిధ సర్వే కార్యక్రమాలు ఉన్నాయని, ఉన్న సిబ్బందితో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుందనే సాకుతో పారిశుద్ధ్య పనులను మరుగున పడేశారని పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీల్లో మాత్రం ప్రతిరోజు తెల్లవారుజామున ప్రధాన రహదారుల శుభ్రత పనులను చేపట్టడంతోనే సరిపెడుతున్నారు. మురుగుకాల్వలు నిండినా.. మురుగును తొలగించే పనులు చేపట్టలేకపోతున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో కాలనీల్లో దుర్గంధం వస్తుందని ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫాగింగ్‌తో పాటు మురుగుకాల్వలను శుభ్రపరిచే కార్యక్రమాలను చేపట్టాలని కోరుతున్నారు.